
సాక్షి
పల్నాడు
శనివారం । 2 । నవంబర్ । 2024



'విజిలెన్స్' వారోత్సవాలు

నగరంపాలెం: విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం విజిలెన్స్ వారోత్సవాలు జరిగాయి. ప్రాంతీయ అధికారి డి.సూర్యశ్రావణకుమార్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589.40 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు విడుదలవుతోంది.



18,503 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 12,825 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 18,503 బస్తాలు అమ్మకాలు జరిగాయి.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరుని సన్నిధిలో జడ్జిలు



నరసరావుపేట రూరల్: తెలంగాణ రాష్ట్రానికి చెందిన పలువురు జూనియర్ సివిల్ జడ్జిలు శుక్రవారం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న న్యాయమూర్తులకు ఈఓ చంద్రశేఖర్ స్వాగతం పలికారు. స్వామికి న్యాయమూర్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలను అర్చకస్వాములు అందజేశారు. త్రికోటీశ్వరున్ని దర్శించుకున్న వారిలో దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కేవీఎస్ హరీష్‌బాబు, భద్రాచలం జూనియర్ సివిల్ జడ్జి శివనాయక్, జడ్చర్ల న్యామమూర్తి ముదాసీర్, గోదావరిఖని న్యాయమూర్తి సచిన్‌రెడ్డి, నిజామాబాద్ న్యాయమూర్తి శ్రీనివాసరావు, కరీంనగర్ న్యాయమూర్తి రాజేశ్వర్ ఉన్నారు.

నకరికల్లు సచివాలయానికి న్యాయమూర్తులు

నకరికల్లు: స్థానిక సచివాలయాన్ని తెలంగాణకు చెందిన పలువురు న్యాయమూర్తులు శుక్రవారం సందర్శించారు. సచివాలయం పనితీరును కార్యదర్శి కె.వి.శివప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. సచివాలయాన్ని సందర్శించిన వారిలో తెలంగాణలోని దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కె.వి.ఎస్.హరీష్‌బాబు, భద్రాచలం జడ్జి శివనాయక్, జడ్చర్ల జడ్జి ముదాసీర్, గోదావరిఖని జడ్జి సచిన్‌రెడ్డి, నిజామాబాద్ జడ్జి శ్రీనివాసరావు, కరీంనగర్ జడ్జి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

4న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈనెల 4న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ జాబ్ మేళా జరుగుతుందని వివరించారు. మేళాలో పదవ తరగతి నుంచి పీజీ, డిప్లొమో, బిటెక్, ఫార్మసీ చదువుకున్న నిరుద్యోగ యువత నేరుగా విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు 9160200652, ఎ.రమ్య 7702921219 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అమరేశ్వరుని సేవలో ఉప లోకాయుక్త జస్టిస్ రజనీరెడ్డి



అమరావతి: అమరావతిలోని శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని ఉపలోకాయుక్త జస్టిస్ రజనీరెడ్డి దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు జస్టిస్ రజనీరెడ్డి దంపతులకు స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం జస్టిస్ రజనీరెడ్డి దంపతులకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామి శేషవస్త్రంతోపాటు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సునీల్‌కుమార్, స్థానిక అధికారులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి నేడు రూ.10 లక్షల సాయం అందజేత



చేబ్రోలు: కొత్తరెడ్డిపాలెం గ్రామంలో కొద్ది కాలం క్రితం దళిత విద్యార్థిని హత్యకు గురైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రూ.పది లక్షల ఆర్థిక సాయాన్ని శనివారం పార్టీ నాయకులు అందజేయనున్నట్టు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. జూలై 15న విద్యార్థిని పేరుపోగు శైలజను గ్యాస్ డెలివరీ బాయ్ నాగరాజు హత్య చేశాడు. నిందితుడిని పోలీసులు ఇంతవరకు అరెస్ట్ చేయలేకపోయారు. శైలజ కుటుంబ సభ్యులకు మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు శనివారం మధ్యాహ్నం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు, నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెక్కు అందజేయనున్నారు.



కస్తల కృష్ణానది ఇసుక రీచ్ వద్ద నిరుపయోగంగా పడి ఉన్న పడవలు

గుర్తుకస్తల!

నాట్ 'రీచ్'బుల్

- పునరుద్ధరణకు నోచుకోని కస్తల ఇసుక రీచ్
- వృథాగా పడి ఉన్న పడవలు
- ఉపాధి కల్పించాలని కోరుతున్న కార్మికులు
- నష్టపోతున్న పడవల యజమానులు

అచ్చంపేట: నాణ్యమైన ఇసుకకు పెట్టింది పేరు కస్తల రీచ్. ఈ రీచ్‌లో 200కుపైగా పడవులు కలిగిన యజమానులు ఉన్నారు. గతంలో ఈ రీచ్ కళకళలాడేది. వెయ్యి మందికిపైగా ఇసుక కార్మికులు నదిలో నుంచి ఇసుకను ఒడ్డుకు తీసుకొచ్చి జీవనోపాధి పొందేవారు. ఇక్కడ లభించే ఇసుకకు రాష్ట్రంలోనే మంచి గిరాకీ ఉంది. శ్లాబులకు, డ్యామ్‌లకు, ఓవర్ బ్రిడ్జిలకు, పెద్దపెద్ద కట్టడాలకు ఈ ఇసుకను వాడేవారు. గతంలో హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు ఇసుకను పెద్దపెద్ద వాహనాలలో తరలించేవారు.

నేడు కళావిహీనం

గత కొంత కాలంగా కొన్ని పరిస్థితుల వల్ల రీచ్‌ని నిలిపివేశారు. ఫలితంగా కళావిహీనంగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు అనధికారికంగా రీచ్‌లో నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలించుకుపోతున్నారు. అయినా అధికారుల ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు.

పునరుద్ధరించాలని కార్మికుల వినతి

ఈ రీచ్‌ను అధికారికంగా పునరుద్ధరిస్తే చుట్టు పక్కల గ్రామాలైన కోనూరు, ఊటుకూరు, కొండూరు, అంబడిపూడి, కస్తల, రుద్రవరం, ఓర్వకల్లు, కోగంటివారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్మికులు వేలాది మంది ఉపాధి పొందుతారు. ఇప్పటివరకు మూలన పడిన 200 పడవల యజమానులూ జీవనం సాగిస్తారు. ప్రస్తుతం పడవలు నిరుపయోగంగా పడి ఉండడంతో శిథిలావస్థకు చేరుతున్నాయని యజమానులు ఆవేదన చెందుతున్నారు. ఈ పడవలను మళ్లీ తయారు చేయించుకోవాలంటే రూ.8 లక్షల నుంచి రూ.పది లక్షల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. ఈ పడవల్లో ఒక లారీలో పట్టేంత ఇసుకను నదిలో నుంచి ఒడ్డుకు తీసుకురావచ్చు. దీంతో కస్తల రీచ్‌ను పునరుద్ధరించాలని కార్మికులు కోరుతున్నారు.

కస్తల రీచ్‌ని పునరుద్ధరించాలి



కస్తల రీచ్‌ను పునరుద్ధరించాలి. అధికారికంగా రీచ్‌కి అనుమతులు లేకపోవడంతో ఇసుక అక్రమ మార్గంలో తరలి వెళుతోంది. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. దీనివల్ల ట్రాక్టరు, లారీల యజమానులు బాగుపడుతున్నారే తప్ప దీనిపైనే ఆధారపడి జీవించే వేలాది మంది కార్మికులు, పడవల యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించాలి.

– షేక్ మహబూబ్‌సుభాని, సర్పంచ్, కస్తల

ప్రస్తుతం 4 రీచ్‌లు

అచ్చంపేట మండలంలోని అంబడిపూడి 1, 2,3 రీచ్‌లతోపాటు కోనూరు రీచ్‌లకు అనుమతులిచ్చిన ప్రభుత్వం టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేసింది. అయితే కస్తల రీచ్‌ను మాత్రం విస్మరించింది. కస్తల మినహా మిగతా రీచ్‌లలో యంత్రాల సాయంతో ఇసుకను తోడతారు. కస్తల రీచ్‌లో అయితే కార్మికులకు నిత్యం ఉపాధి దొరకుతుంది. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే కస్తల రీచ్‌కు త్వరలో అనుమతులు మంజూరు చేసి టెండర్లు పిలుస్తారని రెవెన్యూ అధికారులు చెప్పారు.

మళ్లీ గురుకుల విద్యార్థుల పరార్



పారిపోతుండగా ఉపాధ్యాయుడు వెనక్కి తీసుకొచ్చిన విద్యార్థులు

- గోడ దూకి వెళ్లిపోయిన ఏడుగురు
- నలుగురిని వెనక్కు తీసుకొచ్చిన ఉపాధ్యాయుడు
- తిరిగిరాని ముగ్గురు
- తర్లుపాడులోని స్నేహితుని ఇంటికి వెళ్లినట్టు గుర్తింపు
- ప్రిన్సిపల్, ఉపాధ్యాయుల బదిలీ!
- మీడియాతో మాట్లాడిన జిల్లా కో- ఆర్డినేటర్ పద్మజ



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ


నాదెండ్ల: యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులు మరోసారి పరారవటం కలకలం రేపింది. సెప్టెంబర్ 23న సుమారు 60 మంది విద్యార్థులు పాఠశాల గోడ దూకి సమీపంలోని కొండవీడు కొండల్లోకి పారిపోయిన విషయం విధితమే. తాజాగా శుక్రవారం ఏడుగురు విద్యార్థులు గోడదూకి పారిపోయారు. వీరిలో జ్యోతికిరణ్, దానియేల్, అఖిల్, నాగేశ్వరరావులను అదే పాఠశాల పీఈటీ పట్టుకుని తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. మరో ముగ్గురు విద్యార్థులు మహేష్, అజయ్, శశి సాయంత్రం వరకూ పాఠశాలకు తిరిగి రాలేదు. విషయం తెలుసుకున్న జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ పాఠశాలకు చేరుకున్నారు. వెనక్కు వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గత నెలలో విద్యార్థులు ఇదే తరహాలో పారిపోవటంతో బాధ్యులైన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఉన్నతాధికారుల హామీ మేరకు పాఠశాలలో వసతులు మెరుగుపరిచి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

వైస్ ప్రిన్సిపల్‌కు బాధ్యతలు

తాజా ఘటన నేపథ్యంలో ప్రిన్సిపల్ హనుమంతరావు, ఉపాధ్యాయులందరినీ ఇతర పాఠశాలలకు బదిలీ చేయనున్నట్లు పద్మజ తెలిపారు. ప్రస్తుతం వైస్ ప్రిన్సిపల్‌గా ఉన్న శిరీష్‌బాబుకు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ బాధ్యతలు అప్పగించామని పేర్కొన్నారు. పదో తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు వ్యసనాలకు బానిసలయ్యారన్నారు. వీరి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్టు వెల్లడించారు. పారిపోయిన మిగిలిన విద్యార్థులు తుర్లపాడులోని వారి స్నేహితుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

కోటప్పకొండకు కార్తిక శోభ

- నేటి నుంచి కొండకు భక్తుల రాక
- నెలరోజుల పాటు ప్రత్యేక పూజలు
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికారులు



కోటప్పకొండ క్షేత్రం

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చే భక్తుల కోసం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. కార్తిక మాసంలో కోటప్పకొండకు భక్తులు అధికంగా తరలివస్తారు. నెలరోజులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయి. భక్తులతో క్షేత్రం కళకళలాడుతుంది. సోమవారాలు, కార్తిక పౌర్ణమితో పాటు ఆదివారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా స్వామిని దర్శించుకునేలా వసతులు కల్పించారు.



త్రికోటేశ్వర స్వామి మూలవిరాట్

నాలుగు క్యూలైన్ల ద్వారా దర్శనం..

స్వామి దర్శనానికి వచ్చే భక్తులను నాలుగు క్యూలైన్ల ద్వారా అనుమతిస్తారు. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం, శీఘ్ర దర్శనం, మండప అభిషేక దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ మాసంలో ప్రత్యేక రోజుల్లో భక్తులు రద్దీ దృష్ట్యా స్వామి మూలవిరాట్ అభిషేకాలను రద్దుచేశారు. మండప అభిషేకాలకు అవకాశం కల్పిస్తారు. దీంతోపాటు దేవదాయ శాఖ నుంచి ప్రత్యేక సిబ్బందిని విధుల్లో నియమించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా కుళాయిలు ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంలో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించేలా అదనపు కార్మికులను నియమించారు. భక్తులను కొండకు చేరవేసేందుకు నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ఆర్టీసీ నడపనుంది.

పరోక్ష అభిషేక పథకం

కార్తిక మాసంలో భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించేలా పరోక్ష అభిషేక పథకాన్ని ఆలయం నిర్వహిస్తోంది. రూ.1,000 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకున్న భక్తుల గోత్రనామాలతో రోజూ అభిషేకాలు చేస్తారు. గోత్రనామాలు, పూర్తిచిరునామా, ఫోన్ నంబర్ వివరాలతో పాటు రూ.1,000 మనీయార్డర్, డీడీలను ఆలయ ఈఓ పేరుపై పంపి ఈ పథకంలో చేరవచ్చు. ఈ పథకంలో చేరిన భక్తులకు ఈ మాసంలో ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి దర్శనం కల్పిస్తారు. అలాగే కార్తికమాసం అనంతరం స్వామి విశేష ప్రసాదం, శేషవస్త్రం కొరియర్ లేదా పోస్ట్ ద్వారా అందజేస్తారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు



కార్తికమాసంలో త్రికోటేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేక క్యూలైన్లు, ప్రసాదాలు సిద్ధం చేస్తున్నాం. పారిశుద్ధ్య చర్యలతో పాటు యాత్రికుల వసతి సౌకర్యాలపై దృష్టిసారించాం.

– డి.చంద్రశేఖర్, ఆలయ ఈఓ, కోటప్పకొండ

నదీతీరాల వద్ద బందోబస్తు : ఎస్పీ

నరసరావుపేట: కార్తిక మాసం పుణ్యస్నానాలు ఆచరించే నదీతీరాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఆయన మాట్లాడారు. ప్రజలు పుణ్యస్నానాలు ఆచరించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువులు, కాలువలు, నదుల్లోకి లోతుకు వెళ్లొద్దని హెచ్చరించారు. అమరావతి పుష్కర ఘాట్‌లో కార్తిక దీపోత్సవానికి పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. కృష్ణా కెనాల్ వద్ద కూడా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఏడిపింఛెన్

- ఇప్పటివరకు 7,056 మంది పింఛన్ల కోత
- నవంబరులోనే 1,079 మందికి కట్

నరసరావుపేట: అర్హులందరికీ పింఛన్ అందజేస్తామని శుష్క వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలల్లోనే పల్నాడు జిల్లాలో భారీగా పింఛన్లకు కోత పెట్టింది. గణాంకాలను పరిశీలిస్తే ఈ విషయం సుస్పష్టమవుతోంది. గత ఐదునెలల్లో 7,056 మంది పింఛన్లకు కోత విధించగా, నవంబర్ ఒక్క నెలలోనే 1,079 మందికి పింఛన్ కట్ చేశారు. కూటమి ప్రభుత్వ సీఎంగా నారా చంద్రబాబునాయుడు జూన్ 12న బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత జూలైలో 2,82,126 మందికి పింఛన్లు అందజేసిన సర్కారు తాజాగా నవంబర్‌లో 2,75,70 మందికే పింఛన్ల సొమ్ము విడుదల చేసింది. అంటే గత ఐదు నెలల వ్యవధిలో పింఛన్‌దారుల సంఖ్య 7,056 తగ్గిందన్నమాట. మరణించిన వారిని తీసేసినా వేలల్లో పింఛన్‌దారులు తగ్గే అవకాశం లేదు. దీంతో పింఛన్‌దారులు విలపిస్తున్నారు. తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక లోలోన మదనపడుతున్నారు.

నియోజకవర్గాల వారీగా జూలై నుంచి నవంబర్ మధ్య పింఛన్ల కోత ఇలా..

నియోజకవర్గం	జూలై	నవంబరు
చిలకలూరిపేట	37,982	37,090
గురజాల	44,026	42,921
మాచర్ల	43,520	42,370
నరసరావుపేట	33,622	32,824
పెదకూరపాడు	40,264	39,248
సత్తెనపల్లి	40,559	39,538
వినుకొండ	42,153	41,079
మొత్తం	2,82,126	2,75,070

93.62 శాతం పంపిణీ

ఇదిలా ఉంటే నవంబరు నెల మొదటిరోజు జిల్లాలో 93.62 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. మధ్యాహ్నం వరకు నరసరావుపేట పట్టణంలో సర్వర్ సమస్యతో పింఛన్ల పంపిణీ జరగలేదు. సచివాలయ సిబ్బంది రాకపోవటంతో వృద్ధులు సచివాలయాలకు వచ్చిపోవటం కన్పించింది.

దేశ సమగ్రత కోసం కృషి చేద్దాం

- జిల్లా పోలీసు కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తాదివస్
- సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులు
- ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్, ఎస్పీ



రాష్ట్రీయ ఏక్తాదివస్ ర్యాలీలో కలెక్టర్, ఎస్పీ, జేసీ, అధికారులు

నరసరావుపేట: దేశ ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడేందుకు మనఃపూర్వకముగా కృషి చేద్దామని కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు పిలుపు ఇచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం దేశ మొదటి ఉపప్రధాని, కేంద్ర తొలి హోంశాఖ మంత్రి స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో రాష్ట్రీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తాదివస్)ను నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీలతోపాటు జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, పలువురు పోలీసు అధికారులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. హాజరైన అధికారులు, పోలీసులు, ఎన్‌సీసీ, స్కౌట్, విద్యార్థులతో కలెక్టర్ దేశ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మన జాతి నిర్మాణానికి పునాదులు వేసిన మహోన్నత వ్యక్తులలో వల్లభాయ్ పటేల్ ఒకరని చెప్పారు. అనంతరం పోలీసు శాఖ చేపట్టిన ఐక్యత కోసం పరుగు (రన్ ఫర్ యూనిటీ)ని కలెక్టర్, ఎస్పీ జెండా ఊపి ప్రారంభించి పాల్గొన్నారు. డివిజనల్ పోస్టాఫీసు వరకు సాగిన ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అండర్- 19 క్రికెట్ మ్యాచ్ డ్రా



టి.వరుణ్‌సాత్విక్, 161 పరుగులు



ఏ.దేవిధనుష్, 102 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్ బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 రాష్ట్ర జట్టు ఎంపిక మ్యాచ్‌లో భాగంగా ఏసీఏ- బీ, ఏసీఏ- సీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఏసీఏ- సీ జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 214 పరుగులు చేయగా, ఏసీఏ- బీ జట్టు 593 పరుగులు చేసింది. జట్టులోని టి.వరుణ్ సాత్విక్ 206 బంతుల్లో 161, ఎ.దేవిధనుష్ 236 బంతుల్లో 102 పరుగులతో సెంచరీలు నమోదు చేయగా కేపీఎస్ ప్రసాద్ 78 పరుగులు సాధించాడు. శుక్రవారం రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఏసీఏ- సీ జట్టు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. దీంతో అధికారులు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించిన ఏసీఏ- బీ జట్టుకు 3 పాయింట్లు, ఏసీఏ- సీ జట్టుకు ఒక పాయింట్ లభించింది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పింఛన్ సొమ్ముతో పరారైన ఉద్యోగి

గురజాల: సామాజిక పింఛన్ సొమ్ముతో పరారైన అగ్రికల్చర్ అసిస్టెంట్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వై.వినోద్ కుమార్ తెలిపారు. వివరాలు.. మండల పరిధిలోని పులిపాడు గ్రామానికి చెందిన బత్తుల వెంకట నారాయణ తేలుకుట్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ప్రతి నెలా పింఛన్ పంపిణీలో భాగంగా అగ్రికల్చర్ అసిస్టెంట్ బత్తుల వెంకట నారాయణ పంపిణీ చేయాల్సిన రూ.2,30,000 తీసుకుని పరారయ్యాడు. మధ్యాహ్నం వరకు వస్తాడని ఎదురు చూసిన పంచాయతీ సెక్రటరీ సాయంత్రం అయినా రాకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సెక్రటరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

అన్న హత్య కేసులో తమ్ముడి సహా 10 మంది అరెస్టు

- ఆస్తి తగాదాలే కారణం
- వివరాలు వెల్లడించిన సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హనుమంతురావు, వెనుక ముసుగులో నేరస్తులు

సత్తెనపల్లి: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నను తమ్ముడు బంధువులతో కలసి హతమార్చిన ఘటన క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామంలో గత నెల 27న చోటుచేసుకుంది. దాడిలో చికిత్స పొందుతూ అన్న షేక్ మహబూబ్ బాషా(28) గత నెల 28న మృతి చెందాడు. ఈ హత్య కేసులో తమ్ముడితోపాటు మరో 9 మంది బంధువులను పోలీసులు అరెస్ట్ చేశారు. సత్తెనపల్లిలోని డీఎస్పీ కార్యాలయంలో గురువారం అరెస్ట్ వివరాలను డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామానికి చెందిన షేక్ మున్నీబికి ఇద్దరు భర్తలు ఉన్నారు. ఆమె మొదటి భర్త రెడ్డిగూడెం హుస్సేన్ సాకు షేక్ మహబూబ్ బాషా కుమారుడు ఉన్నాడు. మొదటి భర్తతో ఆమెకు చిన్న, చిన్న గొడవలు జరగగా ఇరువురు విడాకులు తీసుకున్నారు. మొదటి భర్త కుమారుడైన షేక్ మహబూబ్ బాషాకి తండ్రి ద్వారా ఎకరంన్నర పొలం, ఐదు సెంట్ల స్థలంతో పాటు తాత(తల్లి తండ్రి) ద్వారా మరో అర ఎకరం పొలం వచ్చింది. మున్నిబీకి అర ఎకరం పొలం వచ్చింది. అనంతరం తమ్మవరం గ్రామస్తుడైన షేక్ కరీముల్లాను మున్నిబీ రెండో వివాహం చేసుకుంది. వారికి కుమార్తె షేక్ ఫాతిమా, కుమారుడు షేక్ అబ్దుల్ బాసిత్ అలియాస్ బాలు ఉన్నారు. 15 సంవత్సరాల క్రితం మున్నిబీ రెండో భర్త షేక్ కరీముల్లా మృతి చెందాడు. ఆ సమయంలో కుమారుడు షేక్ అబ్దుల్ బాసిత్‌కి తన తండ్రి షేక్ కరీముల్లా ద్వారా 50 సెంట్ల పొలం, 25 సెంట్ల స్థలం తమ్మవరం గ్రామంలో రాసిచ్చారు. సుమారు 13 సంవత్సరాల క్రితం మొదటి భర్త కుమారుడు షేక్ మహబూబ్‌బాషా, షేక్ మున్నిబీ క్రోసూరు మండలం హసనాబాద్ గ్రామం వచ్చి నివాసం ఉంటున్నారు.

తరచూ గొడవలు

ఈ క్రమంలో షేక్ మహబూబ్ బాషాకు ఎక్కువ ఆస్తి వచ్చిందని తమ్ముడైన అబ్దుల్ బాసిత్‌కి తక్కువ ఆస్తి వచ్చిందని తరచూ గొడవలు పడుతూ పెద్ద మనుషులతో పంచాయితీ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అన్నను చంపితే అతని తండ్రి ద్వారా సంక్రమించిన 1.60 ఎకరాల ఆస్తి తనకు చెందుతుందని అబ్దుల్ బాసిత్ భావించాడు. గత నెల 27న రాత్రి సుమారు 8.15 గంటల సమయంలో షేక్ మహబూబ్ బాషా ఇంట్లోకి అబ్దుల్ బాసిత్ 14 మందితో అక్రమంగా ప్రవేశించాడు. బాషా కళ్లల్లో కారం కొట్టి కర్రలు, రాడ్లతో దాడి చేశాడు. బాషా భార్యను, మామను, బావమరిదిపైనా దాడి చేశాడు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ గత నెల 28న బాషా మృతి చెందాడు. మిగిలిన వారు తీవ్ర గాయాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

ప్రత్యేక బృందంతో దర్యాప్తు

పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు పర్యవేక్షణలో పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సురేష్, క్రోసూర్ ఎస్‌ఐ కె.నాగేంద్రరావు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తుచేశారు. గత నెల 30న హసనాబాద్ గ్రామంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. షేక్ అబ్దుల్ బాసిత్, షేక్ మున్నిబీ, షేక్ నాగుల్‌మీరా, షేక్ నన్నేసాహెబ్, షేక్ మాబూ సుభాని, షేక్ మహబూ సుభాని, షేక్ గారపాటి కరిముల్లా, షేక్ గారపాటి పెదబాజి, షేక్ నుసరత్ అలియాస్ నుసరత్ అలీలను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఇనప రాడ్లు, మోటార్ సైకిల్, సరివి కర్రలు, మొబైల్ ఫోన్‌లు స్వాధీనపరచుకున్నారు. అరెస్టు చేసిన 10 మందిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మిగిలిన వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. హత్యకేసును త్వరితగతిన చేదించిన పెదకూరపాడు సీఐ పి.సురేష్, క్రోసూరు ఎస్‌ఐ కె.నాగేంద్రరావు, హెడ్‌కానిస్టేబుల్ మోర్ల అంకమ్మరావు, పోలీస్ కానిస్టేబుళ్లను డీఎస్పీ హనుమంతరావు ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్యవైశ్యుడిననే పోలీసుల వేధింపులు

- బాణసంచా వ్యాపారి ప్రదీప్ ఆవేదన
- రూరల్ సీఐ, ఎస్‌ఐలు వేధించారని ఆరోపణ
- బాణాసంచా దుకాణానికి తాళాలు వేసి తమ వద్దే ఉంచుకున్నారని ఆగ్రహం
- ఎస్పీకి, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడి



మాట్లాడుతున్న వ్యాపారి ప్రదీప్

చిలకలూరిపేట: 'తాను ఆర్యవైశ్యుడని పోలీసులు వేధిస్తున్నారని కేవీఆర్ ట్రేడింగ్ కంపెనీ బాణసంచా దుకాణ యజమాని కె.ప్రదీప్ వాపోయాడు. దీపావళి రోజైన గురువారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్‌ఐ అనిల్‌కుమార్ పోలీసు సిబ్బందితో కలసి బాణసంచా దుకాణాన్ని మూయించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ, ఎస్‌ఐ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఎవరిదో సెల్‌ఫోన్ పోయిందన్న నెపంతో దుకాణంలోకి ప్రవేశించి కస్టమర్లను తిట్టి బయటకు పంపించి వేశారని ఆరోపించారు. దుకాణానికి తాళాలు వేసి వారి వద్దే ఉంచుకున్నారని, పండుగ రోజు వ్యాపారం చేసుకోకుండా అడ్డుకున్నారని చెప్పారు. ఇరువురు గుమస్తాలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉంచుకొని తెల్లకాగితాలపై సంతకాలు పెట్టించుకొని విడిచిపెట్టారని తెలిపారు. దుకాణం ఎలా తెరుస్తావు, వ్యాపారం ఎలా చేస్తారు అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని వివరించారు. అన్ని లైసెన్సులు ఉన్నా, అడిగినంత డబ్బు, ఫార్మాలిటీలు చెల్లించినప్పటికీ వ్యాపారాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో ఎలాంటి అనుమతులు లేని బాణసంచా దుకాణాన్ని సిబ్బంది కాపలా పెట్టి నిర్వహింపజేశారని విమర్శించారు. గత వినాయకచవితి సమయంలోనూ ఎస్‌ఐ అనిల్ కుమార్ తన గ్రామంలో మందులు కాల్చాలని డబ్బులు చెల్లించకుండా బాణసంచా సామగ్రి తీసుకువెళ్లారని ఆరోపించారు. ఇప్పుడు కూడా లైసెన్సులు ఉన్న ఐదు దుకాణాల్లో విచ్చలవిడిగా బాణసంచా సామగ్రి తీసుకువెళ్లారని చెప్పారు. జరిగిన ఘటన రికార్డు చేస్తున్నారని పనిచేసే సిబ్బంది సెల్‌ఫోన్లు లాక్కొని వారి మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీతో పాటు, డీజీపీకి ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన పోలీసులు



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

నరసరావుపేట: దేశ భద్రత, సమాజ రక్షణ కోసం అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. అక్టోబరు 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాల్లో భాగంగా గురువారం సాయంత్రం పోలీసు అధికారులు, సిబ్బంది క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ లింగంగుంట్ల సెంటర్ వరకు కొనసాగింది. దీనిలో భాగంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, సమాజ శ్రేయస్సుకై అహర్నిశలు పోరాడి అమరులైన పోలీసుల త్యాగ నిరతికి ఇవే మా జోహార్లు అంటూ అధికారులు అమరవీరులను స్మరించుకున్నారు. ఏఆర్ డీఎస్పీ మహాత్మ గాంధీరెడ్డి, వెల్ఫేర్ ఆర్‌ఐ గోపీనాథ్ పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సీనియర్ ఉపాధ్యాయులకు సన్మానం

నరసరావుపేట ఈస్ట్: ఉర్దూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పల్నాడు జిల్లా ఉర్దూ ఉపాధ్యాయుల సదస్సు తీర్మానించింది. రామిరెడ్డిపేటలోని శ్రీగాలిబ్ ఉర్దూ పాఠశాలలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి పల్నాడుజిల్లా యూనిట్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. సదస్సులో అన్ని జిల్లాలకు ఉర్దూ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్, డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఉర్దూ స్కూల్స్ పోస్టులకు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరుతూ తీర్మానించారు. అలాగే రానున్న డీఎస్సీలో ఉర్దూ ఖాళీలను భర్తీ చేయాలని, ప్రాథమిక స్థాయి నుంచి డిగ్రీ స్థాయి వరకు బోధనా సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ పల్నాడు జిల్లా నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా షేక్ మహబూబ్ సుభానీ, ప్రధాన కార్యదర్శిగా షేక్ మొహిద్దీన్ బాషా, ఫైనాన్స్ కార్యదర్శిగా షేక్ ఆదం షఫీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అబ్దుల్ ముజీబ్ షాహి, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి రోషన్ జమీర్, ఫైనాన్స్ కార్యదర్శి అబ్దుల్ షజీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు బెదిరింపులు

నరసరావుపేట రూరల్: అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేస్తావా.. మీ భర్తపై కేసుపెట్టి జైలుకు పంపమంటావా అంటూ టీడీపీ నాయకులు, ఐసీడీఎస్ అధికారులు చేసిన బెదిరింపులు తట్టుకోలేక ఓ అంగన్‌వాడీ కార్యకర్త తన ఉద్యోగానికి రాజీనామా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పల్నాడు జిల్లా రావిపాడు పంచాయతీ పరిధిలోని బాలయ్యనగర్‌కు చెందిన మల్లెం ధనలక్ష్మి 13 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తోంది. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్యోగానికి రాజీనామా చేయాలంటూ ఆమెపై టీడీపీ నాయకుడు కండ్లకుంట సీతయ్య ఒత్తిడి తీసుకొచ్చాడు. ఆమె అంగీకరించకపోవడంతో ఐసీడీఎస్ అధికారులతో కలసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆగస్టు 14వ తేదీన సీడీపీవో ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ పార్వతి ఆమెను ఐసీడీఎస్ కార్యాలయానికి పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్బంధించారు. ఉద్యోగానికి రాజీనామా చేయకపోతే మీ భర్త సుభాష్‌పై కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని, నీవు ఉద్యోగంలో అక్రమాలకు పాల్పడినట్టు నిరూపించి రికవరి చేస్తామని బెదిరింపులకు దిగారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన భర్త సుభాష్‌కు విషయం తెలియజేయకుండా గత్యంతర లేని పరిస్థితుల్లో ధనలక్ష్మి తన ఉద్యోగానికి రాజీనామా చేసింది. నవంబర్ 21వ తేదీ నుంచి ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్టు రెండు పత్రాలపై ఆమెతో సంతకాలు తీసుకున్నారు. విషయం తెలుసుకున్న సుభాష్ దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా సీతయ్య తన అనుచరులతో మరోసారి బెదిరింపులకు పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును ఆశ్రయించింది. కండ్లకుంట సీతయ్య, సూపర్‌వైజర్ పార్వతిలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరింది. బెదిరించి రాయించుకున్న రాజీనామాను ఉపసంహరించి ఉద్యోగంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని విన్నవించింది.

అంతర్జాతీయ సదస్సుకు ఏఎన్‌యూ ఆచార్యులు

ఏఎన్‌యూ: ఈ నెల 8, 9 తేదీలలో థాయ్‌లాండ్, బ్యాంకాక్‌లో 'పరిశోధన , ఆవిష్కరణల'పై జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె మధుబాబు, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య బి.నాగరాజులు హాజరు కానున్నారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అసోసియేషన్ నుంచి ఆహ్వాన పత్రిక అందినట్లు వారు తెలిపారు. వీరిని వర్సిటీ ఉన్నతాధికారులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

ఏఎన్‌యూ ప్రిన్సిపాల్‌గా సురేష్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా ఇంగ్లిష్ విభాగం ఆచార్యులు, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వైస్ ప్రిన్సిపల్‌గా వ్యవహరించిన ఆయన పదోన్నతి పొందారు. మాజీ ప్రిన్సిపల్ ఆచార్య స్వరూపారాణి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య కె .గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. యూనివర్సిటీ అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు.